తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం - 21 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 108 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# బహుజన రాజ్యం కోసం
# కాంగ్రెస్‌ను గద్దె దించాలి



నేను బహుజనుల బాణాన్ని..

యువత యుద్ధ నినాదాన్ని

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**కోస్గి, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభకు భారీగా ప్రజలు తరలి వచ్చారు. సభలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర రాజకీయాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు, సామాజిక న్యాయం తదితర అంశాలపై మాట్లాడారు.కవిత మాట్లాడుతూ తాను కాంగ్రెస్, బీఆర్ఎస్ లేదా బీజేపీ బాణాన్ని కాదని, "బహుజనుల బాణాన్ని.. యువత యుద్ధ నినాదాన్ని" అని అన్నారు. అంబేద్కర్ వాదాన్ని, పూలే ఆత్మగౌరవాన్ని ముందుకు తీసుకెళ్లే రాజకీయ ప్రయాణం చేస్తున్నానని తెలిపారు. సావిత్రీబాయి పూలే ఆశయాలతో మహిళగా రాజకీయ రంగంలో ముందుకు సాగుతున్నానని చెప్పారు. బహుజన రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ను గద్దె దించాల్సిందేనని కవిత అన్నారు.

మిగతా 2లో..

## లిఫ్ట్ ప్రమాదంలో ఇరుక్కున్న వ్యక్తికి రక్షణ

- హైడ్రా సాహసోపేత చర్య
- గోడకు మధ్య చిక్కుకున్న మురళి
- గంటన్నర పాటు కొనసాగిన ఆపరేషన్
- అప్రమత్తతతో ప్రాణాలు కాపాడిన హైడ్రా బృందం



**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

మూసాపేట ఆంజనేయనగర్‌లోని ఓ మూడు అంతస్తుల భవనంలో లిఫ్ట్ ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న వ్యక్తిని హైడ్రా బృందం సాహసోపేతంగా రక్షించింది. లిఫ్ట్‌కు, గోడకు మధ్య ఇరుక్కొని వేలాడుతున్న మురళి అనే వ్యక్తిని గంటన్నర పాటు శ్రమించి సురక్షితంగా బయటకు తీసింది. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకోగా స్థానికులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం ప్రకారం పాత గ్రిల్స్‌తో కూడిన లిఫ్ట్‌లో సెన్సార్లు సరిగా పని చేయకపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. మురళి తన సతీమణితో కలిసి గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో అంతస్తుకు వెళ్లాడు. రెండో అంతస్తులో లిఫ్ట్ ఆగిన తర్వాత బయటకు దిగేందుకు ప్రయత్నిస్తుండగా మూడో అంతస్తు నుంచి మరో వ్యక్తి లిఫ్ట్ బటన్ నొక్కడంతో లిఫ్ట్ ఒక్కసారిగా పైకి కదిలింది. దీంతో మురళి ఒక కాలు లిఫ్ట్‌లో, మరో కాలు అంతస్తు వద్ద ఉండగానే లిఫ్ట్ పైకి వెళ్లి ఆయన గ్రిల్స్‌లో చిక్కుకుపోయాడు. మురళి సతీమణి కేకలు వేయడంతో అపార్టుమెంట్‌లోని నివాసితులు వెంటనే స్పందించి రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో హైడ్రా నియంత్రణ

మిగతా 2లో..

## రంగారెడ్డి కాంగ్రెస్‌కు కొత్త బాధ్యతలు

- పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వక భేటీ
- మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేత
- పార్టీ బలోపేతంపై చర్చ



**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు)**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నియమితులైన పారిజాత నర్సింహారెడ్డి తన భర్తతో కలిసి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పార్టీ అధిష్ఠానం ఆమెను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నియమించిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆమె తన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పారిజాత నర్సింహారెడ్డి దంపతులు మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జిల్లా కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. భేటీలో రంగారెడ్డి జిల్లాలో పార్టీ పరిస్థితులు, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత బలోపేతం

మిగతా 2లో..

## ఫలించిన పాలిటెక్నిక్
# విద్యార్థుల పోరాటం!

- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం ప్రతిపాదనపై ప్రభుత్వం వెనక్కి
- పాత విధానంలోనే డిప్లొమా విద్య..
- సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే పాలిటెక్నిక్‌లు
- 35 రోజుల పోరాటానికి ఫలితం..
- అధ్యాపకుల సహాయ నిరాకరణతో దిగొచ్చిన ప్రభుత్వం


**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనపై విద్యార్థులు, అధ్యాపకులు సాగించిన సుదీర్ఘ పోరాటం కీలక మలుపు తిరిగింది. పాలిటెక్నిక్ విద్యను ప్రస్తుత సాంకేతిక విద్యా వ్యవస్థ నుంచి వేరు చేయాలన్న ప్రతిపాదనపై విద్యార్థులు, అధ్యాపకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ప్రభుత్వం ప్రతిపాదనపై పునరాలోచనకు వచ్చినట్లు తెలుస్తోంది. సుమారు 35 రోజులుగా విద్యార్థులు, అధ్యాపకులు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, సాంకేతిక విద్యామండలి ఆధ్వర్యంలోని ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. డిప్లొమా విద్యలో మార్పులు తీసుకురావడం వల్ల విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అధ్యాపకుల సహాయ నిరాకరణతో ఒత్తిడి**

విద్యార్థుల ఆందోళనకు అధ్యాపకులు, సిబ్బంది మద్దతుగా నిలిచారు. అదనపు విధులకు సహాయ నిరాకరణ ప్రకటించడం ద్వారా తమ నిరసనను మరింత ఉధృతం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరిశీలన, మూల్యాంకనం వంటి

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బహుజన రాజ్యం కోసం కాంగ్రెస్‌ను గద్దె దించాలి





(మొదటి పేజీ తరువాయి)

ప్రజల ఆశీర్వాదం ఉంటే ప్రధాని మోదీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పోరాడతానని పేర్కొన్నారు. ఎవరి మద్దతు లేకుండా ఒక మహిళ రాజకీయంగా ఎదగగలదని నిరూపిస్తానని అన్నారు.

**విద్య, వైద్యానికి ప్రాధాన్యం**

తెలంగాణలో విద్యా వ్యవస్థ పరిస్థితిపై కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామానికి ఒక పాఠశాల, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని అన్నారు. ప్రభుత్వ విద్య, వైద్యం బలోపేతం కావాలని, ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.యువతను నమ్మి వారి ఆలోచనలను ప్రోత్సహిస్తామని, వ్యాపార ఆలోచనలను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందించే విధానం తీసుకురావాలని భావిస్తున్నట్లు చెప్పారు.

**సాగునీటిపై కీలక వ్యాఖ్యలు**

పాలమూరు ప్రాంతంలో కృష్ణా, తుంగభద్ర తదితర నదులు ఉన్నప్పటికీ ప్రజలకు సాగునీరు అందడం లేదని కవిత విమర్శించారు. జూరాల నుంచి నీటిని తీసుకుని పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ఈ లక్ష్యాన్ని సాధించకపోతే తన పేరు మార్చుకుంటానని వ్యాఖ్యానించారు. రైతులు యూరియా, విద్యుత్, సాగునీరు, రైతు భరోసా, మద్దతు ధర, బోనస్ కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**సామాజిక న్యాయమే లక్ష్యం**

రాష్ట్రంలో సామాజిక అన్యాయం జరుగుతోందని కవిత ఆరోపించారు. ముదిరాజ్, ముస్లిం, నేతన్న, గీతన్న వర్గాలతో పాటు మాదిగ, మాల తదితర వర్గాలకు జనాభా ప్రాతిపదికన తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. మహిళలకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తమ పార్టీ తెలంగాణ ప్రజల కోసం పనిచేస్తుందని, విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం వంటి అంశాల చుట్టూ 'పాంచజన్యం' కార్యాచరణను రూపొందించినట్లు కవిత తెలిపారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని కవిత విమర్శించారు. ఉద్యోగాలు, రైతుల సమస్యలు, విద్య, వైద్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు.తెలంగాణ ప్రజలు తమ పార్టీని ఆశీర్వదించి బహుజన తెలంగాణ నిర్మాణానికి సహకరించాలని కవిత కోరారు.

# ఫలించిన పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటం!

(మొదటి పేజీ తరువాయి)

అదనపు బాధ్యతలను చేపట్టబోమని స్పష్టం చేయడంతో ప్రభుత్వం కూడా సమస్య పరిష్కారంపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది.విద్యార్థులు, అధ్యాపకుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం చర్చలకు ముందుకు వచ్చింది. పాలిటెక్నిక్ విద్య భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధతను తొలగించేందుకు చర్యలు చేపట్టింది.

**పాత విధానంలోనే పాలిటెక్నిక్ విద్య**

తాజా పరిణామాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధి నుంచి వేరు చేసే ప్రతిపాదనకు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న విధానంలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్యామండలి వ్యవస్థలు యథాతథంగా కొనసాగనున్నాయి. డిప్లొమా కోర్సుల నిర్వహణలోనూ ప్రస్తుత విధానాన్నే కొనసాగించనున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి నిబంధనలు, పరీక్షల విధానం, డిప్లొమా విద్యకు సంబంధించిన ప్రస్తుత వ్యవస్థలో మార్పులు ఉండవని స్పష్టత ఏర్పడింది.

**విద్యార్థుల ఆందోళనలకు కారణాలేమిటి?**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్‌లను తీసుకురావాలన్న ప్రతిపాదన విద్యార్థుల్లో పలు సందేహాలకు దారితీసింది. డిప్లొమా విద్య స్వరూపం, పరీక్షల నిర్వహణ, సాంకేతిక విద్యామండలి పాత్ర, ఉన్నత విద్యకు ఉన్న అవకాశాలపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డిప్లొమా పూర్తిచేసిన తర్వాత ఇంజినీరింగ్ విద్యలో ప్రవేశానికి ఉన్న అవకాశాలు, విద్యా ప్రమాణాలు, ధ్రువపత్రాల గుర్తింపు వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు పాలిటెక్నిక్ కళాశాలల్లో నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు కొనసాగాయి.

హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో విద్యార్థులు ఆందోళనలకు దిగారు. ఉద్యమం క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**పోరాటానికి దక్కిన ఫలితం**

35 రోజులుగా విద్యార్థులు, అధ్యాపకులు కలసి సాగించిన ఉద్యమం పాలిటెక్నిక్ విద్య భవిష్యత్తుపై ప్రభుత్వాన్ని పునరాలోచన చేయించే స్థాయికి తీసుకెళ్లింది. అధ్యాపకుల సహాయ నిరాకరణతో పాటు విద్యార్థుల నిరసనలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి.పాలిటెక్నిక్ విద్యను కాపాడాలనే డిమాండ్‌తో ప్రారంభమైన ఉద్యమం చివరకు ప్రభుత్వం ప్రతిపాదనను వెనక్కి తీసుకునే దిశగా పరిణామాలను తీసుకువచ్చింది. ప్రస్తుతం ఉన్న సాంకేతిక విద్యా వ్యవస్థలోనే పాలిటెక్నిక్ విద్య కొనసాగనున్న నేపథ్యంలో విద్యార్థులు, అధ్యాపకుల్లో ఉపశమనం వ్యక్తమవుతోంది. అయితే ప్రభుత్వం నుంచి వెలువడే తుది అధికారిక ఉత్తర్వుల ఆధారంగానే ఈ నిర్ణయంపై పూర్తి స్పష్టత రానుంది. అప్పటి వరకు పాలిటెక్నిక్ విద్యకు సంబంధించిన తదుపరి పరిణామాలను విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# అమెరికాకు ఇరాన్ ఏడు షరతులు

- **ఖతార్ ద్వారా అమెరికాకు చేరినట్లు వెల్లడి**
- **యుద్ధం ముగింపు, ఆస్తుల విడుదల డిమాండ్**
- **అంగీకరించకపోతే నిర్ణయాత్మక యుద్ధానికి సిద్ధమన్న ఇరాన్**



**టెహ్రాన్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికా నుంచి తమకు ఎలాంటి సందేశం లేదా ప్రతిపాదన రాలేదని ఇరాన్ విదేశాంగశాఖ స్పష్టం చేసింది. పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ టెహ్రాన్ పర్యటన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఆయన పర్యటన ప్రధానంగా ఇరాన్-పాకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలు, గతంలో కుదిరిన ఒప్పందాలపై చర్చలకే పరిమితమని ఇరాన్ తెలిపింది. మరోవైపు అమెరికాతో చర్చలు పునఃప్రారంభించేందుకు ఇరాన్ ఏడు షరతులను ఖతార్ మధ్యవర్తిత్వం ద్వారా వాషింగ్టన్‌కు పంపినట్లు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మోహసీన్ రెజాయి తెలిపారు. ఈ షరతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందన కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడు షరతుల్లో ఇప్పటివరకు వెల్లడైన ప్రధాన డిమాండ్లలో అన్ని రంగాల్లో యుద్ధాన్ని ముగించడం, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని తొలగించడం ఉన్నాయి. మిగిలిన షరతులను పూర్తిగా బహిరంగంగా వెల్లడించలేదు. తమ డిమాండ్లను అమెరికా అంగీకరించకపోతే 'నిర్ణయాత్మక యుద్ధానికి' సిద్ధంగా ఉన్నామని రెజాయి హెచ్చరించారు. అదే సమయంలో చర్చలకు దౌత్య మార్గంలో ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఖతార్‌తో పాటు పాకిస్థాన్ కూడా ఇరాన్-అమెరికా మధ్య చర్చల పునఃప్రారంభానికి మధ్యవర్తిత్వ ప్రయత్నాలు చేస్తోంది.

# రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి

- **వినాశకర దాడులు - ఇద్దరి మృతి**
- **రష్యా ప్రతిదాడులు - డ్రోన్ల కూల్చివేత**
- **ఎన్నికలే లక్ష్యంగా ఆరోపణలు**

**మాస్కో సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రష్యాఉక్రెయిన్ యుద్ధం మరింత భీకర రూపాన్ని దాల్చింది. రష్యా రాజధాని మాస్కోతో పాటు పలు ప్రాంతాలపై ఉక్రెయిన్ ఏకంగా 1,000కి పైగా డ్రోన్లతో విరుచుకుపడి వినాశకరమైన దాడులకు పాల్పడింది. రష్యాలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న చివరి రోజైన ఆదివారం ఈ దాడులు జరగడం తీవ్ర కలకలం రేపింది. శనివారం రాత్రి ప్రారంభమైన ఈ డ్రోన్ల వర్షం ఉదయం వరకు కొనసాగింది. రష్యాతో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి ఆ దేశ భూభాగంపై ఉక్రెయిన్ చేపట్టిన అత్యంత భారీ మరియు అతిపెద్ద దాడిగా విశ్లేషకులు దీనిని భావిస్తున్నారు.వినాశకర దాడులు ఇద్దరి మృతిఈ డ్రోన్ల దాడిలో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా, 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో 74 ఏళ్ల వృద్ధుడు, 44 ఏళ్ల మహిళ ఉన్నారు. మాస్కో మేయర్ సెర్గీ సొబ్యానిన్ మాట్లాడుతూ, రాజధాని నగర చరిత్రలోనే ఇది అత్యంత తీవ్రమైన దాడి అని అభివర్ణించారు. మాస్కోలోని ప్రముఖ ఆయిల్ రిఫైనరీతో పాటు బహుళ అంతస్తుల నివాస గృహాలు ఈ దాడుల్లో దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. రష్యా ప్రతిదాడులు డ్రోన్ల కూల్చివేతఈ తీవ్ర పరిణామాలపై రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ కూడా స్పందించింది. ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్లలో రష్యా రక్షణ దళాలు దాదాపు 1,100 డ్రోన్లను గగనతలంలోనే నిర్వీర్యం చేశాయని ప్రకటించింది. రష్యా ఆధీనంలో ఉన్న క్రిమియా ద్వీపకల్పం మరియు నల్ల సముద్ర తీర ప్రాంతాలపై కూడా దాడులు జరిగాయని తెలిపింది. కేవలం మాస్కో వైపు దూసుకొచ్చిన 450 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికలే లక్ష్యంగా ఆరోపణలుతమ దేశంలో జరుగుతున్న ప్రజాస్వామ్య పార్లమెంట్ ఎన్నికలను భగ్నం చేసేందుకు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకే ఉక్రెయిన్ ఈ దాడులకు పాల్పడిందని రష్యా తీవ్రంగా ఆరోపించింది. ఎన్నికలను అడ్డుకోవడమే శత్రుదేశం ప్రధాన లక్ష్యమని పేర్కొంది. కాగా, ఈ భారీ దాడికి సంబంధించి ఉక్రెయిన్ ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# లిఫ్ట్ ప్రమాదంలో ఇరుక్కున్న వ్యక్తికి రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రానికి సమాచారం అందించారు. ఉదయం 9.15 గంటలకు సమాచారం అందుకున్న హైడ్రా బృందం కేవలం పదిహేను నిమిషాల్లో ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించింది. హైడ్రా మార్షల్ జేడీవీ ప్రసాద్ నేతృత్వంలోని బృందం మూడో అంతస్తు, రెండో అంతస్తు మధ్య ప్రమాదకర స్థితిలో చిక్కుకున్న మురళిని రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు హైడ్రాలిక్ కట్టర్‌తో సంఘటన స్థలానికి చేరుకున్నారు. లిఫ్ట్ గోడను కొంత మేర తొలగించి, అత్యంత జాగ్రత్తగా సహాయక చర్యలు కొనసాగించారు. దాదాపు గంటన్నర పాటు కొనసాగిన కఠిన ఆపరేషన్ అనంతరం ఉదయం 10.50 గంటలకు మురళిని సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. లిఫ్ట్‌కు, గోడకు మధ్య కాలు నలిగిపోవడంతో ఆయన కాలుకు విరుగు గాయమైనట్లు వైద్యులు తెలిపారు. అయితే సమయానికి సహాయక చర్యలు చేపట్టడంతో ప్రాణాపాయం తప్పిందని వెల్లడించారు. సాహసోపేతంగా ప్రాణాలను కాపాడిన హైడ్రా, అగ్నిమాపక సిబ్బందిపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. ఈ ఆపరేషన్‌లో హైడ్రా బృంద సభ్యులు ఎర్రసాని అనిల్‌కుమార్, జమ్మ రమేష్, వీత రమేష్, పల్లికామిటి గోపి, పోలీసు కానిస్టేబుల్ నరేష్‌తో పాటు సనత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. వేగంగా స్పందించి వ్యక్తిని రక్షించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# రంగారెడ్డి కాంగ్రెస్‌కు కొత్త బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)



వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరంపై అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రజా సమస్యలపై పార్టీ పోరాటాలను మరింత విస్తరించాలని కూడా చర్చించినట్లు సమాచారం

కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పారిజాత నర్సింహారెడ్డికి మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ జిల్లాలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను చేపట్టాలని సూచించినట్లు తెలిసింది.

రంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి బలమైన స్థానం కల్పించేందుకు సమష్టి కృషి అవసరమని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పాత్రను మరింత బలోపేతం చేయాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.ఈ మర్యాదపూర్వక భేటీతో జిల్లా కాంగ్రెస్ నాయకత్వం మరియు రాష్ట్ర పార్టీ నాయకత్వం మధ్య సమన్వయం మరింత బలపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ ప్రజల్లో కాంగ్రెస్ ప్రభావాన్ని పెంచేందుకు కృషి చేయనున్నట్లు నాయకులు తెలిపారు.

# రూ.4.32 లక్షల కోట్ల భారం - కాంగ్రెస్‌కు నివేదిక



- **వ్యయం వివరాలు - చమురు & రక్షణ టెక్నాలజీ**
- **మిగిలివున్న ఇతర ఖర్చులు & పెరగనున్న భారం**

**అమెరికా సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికాఇరాన్ సంక్షోభం ఏడు నెలలుగా కొనసాగుతుండటంతో వైట్ హౌస్ భారీ ఖర్చులను నమోదు చేస్తోంది. ట్రంప్ ప్రభుత్వం ఇటీవల యూఎస్ కాంగ్రెస్‌కు సమర్పించిన వివరాల ప్రకారం ఈ యుద్ధం కోసం ఇప్పటివరకు $45.1 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు ₹4.32 లక్షల కోట్లు) వ్యయం అయింది. ఇది భారతదేశంలోని అనేక ప్రధాన రాష్ట్రాల వార్షిక బడ్జెట్‌తో సమానం. వ్యయం వివరాలు చమురు & రక్షణ టెక్నాలజీమొత్తం $45.1 బిలియన్ల ఖర్చులో అత్యధిక భాగం ($43.6 బిలియన్లు) ప్రత్యక్ష పోరాట చర్యలు, క్షిపణి రక్షణ వ్యవస్థలు మరియు మిస్సైళ్ల పునరుద్ధరణ కోసమే వినియోగించారు. మిగిలిన $1.5 బిలియన్ డాలర్లు చమురు రవాణా మరియు సైనిక ఇంధన అవసరాల కోసం ఖర్చయినట్లు పెంటగాన్ వెల్లడించింది. ఇరాన్ దాడులను అడ్డుకోవడానికి అత్యాధునిక క్షిపణి నిరోధక టెక్నాలజీని పెద్దఎత్తున ఉపయోగించడమే ఈ భారీ వ్యయానికి ప్రధాన కారణం. మిగిలివున్న ఇతర ఖర్చులు & పెరగనున్న భారంఈ అంచనాలు కేవలం ఫిబ్రవరి 28 నుంచి సెప్టెంబర్ 2 వరకు జరిగిన ప్రాథమిక వ్యయాన్ని మాత్రమే ప్రతిబింబిస్తున్నాయి. దాడుల్లో ధ్వంసమైన సైనిక స్థావరాల పునర్నిర్మాణం, ధ్వంసమైన భవనాల మరమ్మతులు మరియు దౌత్యపరమైన చర్చలకు సంబంధించిన ఇన్సిడెంటల్ ఖర్చులు ఇందులో ఇంకా చేర్చలేదు. హోర్ముజ్ జలసంధి గుండా చమురు సరఫరాకు ఆటంకం కలగడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో ధరలు పెరిగి అదనపు ఆర్థిక భారం పడుతోంది. యుద్ధం ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో ఈ వ్యయం మరింతగా పెరిగే అవకాశం ఉంది.

# ఎంబీబీఎస్ విద్యార్థికి అయ్యపురెడ్డి ఫౌండేషన్ అండ



- **పుస్తకాల కొనుగోలుకు రూ.10 వేల ఆర్థిక ప్రోత్సాహకం**

**పెద్దమందడి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా మండలంలోని మోజర్ల గ్రామానికి చెందిన గట్టు రమేష్ కుమారుడు గట్టు యువరాజ్ ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి ప్రజావైద్యశాల డాక్టర్ మురళీధర్ చేతుల మీదుగా యువరాజ్‌ను సన్మానించారు.విద్యార్థి వైద్య విద్యకు అవసరమైన పుస్తకాల కొనుగోలు కోసం ఫౌండేషన్ తరపున రూ.10,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. యువరాజ్ పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ విద్యను విజయవంతంగా పూర్తి చేసి, భవిష్యత్‌లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించేందుకు అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

# ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రవేశ పరీక్ష



- **పరీక్షకు హాజరైన సుమారు 400 మంది అభ్యర్థులు**

**వనపర్తి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల దిశగా మార్గనిర్దేశం చేయడంతో పాటు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రవేశ పరీక్ష విజయవంతంగా జరిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధుకర్ స్వామి ఆధ్వర్యంలో వనపర్తిలోని రేడియంట్ హైస్కూల్, తిరుమల హిల్స్ ఆవరణలో నిర్వహించిన ఈ పరీక్షకు సుమారు 400 మంది విద్యార్థులు, అభ్యర్థులు ఉత్సాహంగా హాజరయ్యారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దమందడి ఎస్ఐ జలంధర్ రెడ్డి హాజరై అభ్యర్థులను అభినందించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో పాటు పక్కా ప్రణాళికతో సన్నద్ధం కావాలని సూచిస్తూ అభ్యర్థులకు ప్రోత్సాహకరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్, డా. గద్దె ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. పరీక్ష నిర్వహణకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పరి తిరుమలేష్, శైలజ, బాలా సుబ్రహ్మణ్యం, వెంకటేష్, మల్లేష్, రాహుల్, భాను, రజిత తదితరులు సహకరించారు.యువతలో పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు ఉపయోగపడే కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు గద్దె భాస్కర్ తెలిపారు.

# డాక్టర్ కందుల సుధాకర్ కు అక్షర కిరీటి బిరుదు ప్రధానం



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ శ్రీ కళావేదిక జాతీయ సంస్థ భద్రాచలం ఐ టి డి ఏ పి ఓ మరియు ఐ ఏ ఎ ఎస్ రాహుల్ చేతులు మీదుగా సెప్టెంబర్ 20 వ తేదీన భద్రాద్రి కవిత పండుగలో ఏటపాక డాక్టర్ పాలురాజు ఇంజనీరింగ్ కళాశాల పోలవరం జిల్లా భద్రాద్రి లో నిర్వహించిన మెగా కవి సమ్మేళనంలో ఖమ్మం జిల్లా నుండి ప్రముఖ కవి రచయిత నంది అవార్డు గ్రహీత డాక్టర్ కందుల సుధాకర్ పాల్గొని చెట్టు మనసు అనే కవితను ఆలపించారు దీని గాను భద్రాచలం ఐటిడిఏ పీవో రాహుల్ ఐ ఏ ఎ ఎస్ మరియు శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం మరియు భద్రాద్రి కమిటీ సభ్యులు అందరూ కలిసి డాక్టర్ కందుల సుధాకర్ కి అక్షర కిరిటి బిరుదును ప్రధానం చేసి,మేమెంటో మరియు సర్టిఫికెట్ శాలువాతో ఘనంగా సత్కరించారు తనకు అక్షర కిరిటీ బిరుదులు ప్రధానం చేసిన ఐటీడీఏ పిఓ మరియు ఐ ఏ ఎ ఎస్ రాహుల్ కి మరియు శ్రీ శ్రీ కళా వేదిక కమిటీ సభ్యులకు మరియు భద్రాద్రి కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన ఖమ్మం జిల్లా ప్రజలకు అభినందనలు తెలియజేశారు. ఇంకా తెలుగు భాష సాహిత్యానికి అహర్నిశలు కట్టించి పనిచేస్తా నని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐటిడీఏ పిఓ మరియు ఐ ఏ ఏ ఎస్ రాహుల్ మరియు ప్రముఖులు పంచాక్షరయ్య,, శ్రీనాధ వంశస్థులు భక్త రామదాసు వంశస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడిలో దూకుడు పెంచుతున్న అల్వాల వెంకట్ రెడ్డి

- **పార్టీ పదవి ఇస్తే మరింత క్రియాశీలకంగా పనిచేసే అవకాశం.. బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చ**





**పెద్దమందడి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో బీఆర్ఎస్ నాయకుడు అల్వాల వెంకట్ రెడ్డి తనదైన శైలిలో దూకుడుగా వ్యవహరిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల విమర్శలకు దీటుగా స్పందిస్తూ, వివిధ అంశాలపై స్పష్టంగా మాట్లాడటం ద్వారా మండల రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.

రైతుల సమస్యలపై పూర్తి అవగాహనతో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి.. రైతులకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ ప్రతిపక్ష పార్టీలకు గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు. ఏ అంశంపైనైనా అనర్గళంగా మాట్లాడే సామర్థ్యం, ప్రజా సమస్యలను ప్రస్తావించే తీరు, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యం ఆయనకు మరింత గుర్తింపు తీసుకొస్తున్నాయని స్థానికంగా చర్చ జరుగుతోంది.ముఖ్యంగా పెద్దమందడి మండలం అధికారపక్ష ఎమ్మెల్యేకు సొంత మండలం కావడంతో బీఆర్ఎస్ తరపున ప్రతిపక్ష పాత్రను మరింత బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వెంకట్ రెడ్డి దూకుడు పార్టీకి కలిసొచ్చే అంశంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పార్టీ పదవి ఇస్తే మరింత దూకుడు

వెంకట్ రెడ్డికి బీఆర్ఎస్ అధిష్టానం ఏదైనా పార్టీ పదవి అప్పగిస్తే ఆయన మరింత బాధ్యతతో, దూకుడుగా పనిచేసే అవకాశం ఉందని మండల ప్రజలు, పార్టీ కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఎలాంటి పదవి లేకుండానే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రతిపక్షాలకు కౌంటర్ ఇస్తున్న ఆయనకు సంస్థాగత బాధ్యతలు అప్పగిస్తే మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ప్రజా సమస్యలను బలంగా వినిపించే నాయకులు, ప్రతిపక్షాలను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా ఉన్న నేతలను బీఆర్ఎస్ అధిష్టానం గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. ముఖ్యంగా రాబోయే రోజుల్లో వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పునర్వైభవానికి కృషి చేయాలంటే క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేసే నాయకులకు బాధ్యతలు అప్పగించడం కీలకమని వారు పేర్కొంటున్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నాయకత్వంలో వనపర్తిలో పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే వెంకట్ రెడ్డి వంటి దూకుడుగా వ్యవహరించే నాయకులను అధిష్టానం గుర్తించి తగిన బాధ్యతలు అప్పగించాలని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ పదవి దక్కితే వెంకట్ రెడ్డి మరింత చురుగ్గా పనిచేస్తూ పెద్దమందడి మండలంలో బీఆర్ఎస్ బలోపేతానికి తన వంతు పాత్ర పోషించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

# వర్ష బీభత్సంపై మేయర్ క్షేత్రస్థాయి పరిశీలన





- **డిజాస్టర్ మేనేజ్‌మెంట్, నగరపాలక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**
- **లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన-మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, సెప్టెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు ):** నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసిన నేపథ్యంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి లోతట్టు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. 31, 53, 59, 60, 64వ డివిజన్లలో పర్యటించి వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలు, రోడ్లు, మురుగు కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.zప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాలు, రహదారులపై నిలిచిన వర్షపు నీటిని వెంటనే బయటకు పంపించాలని, మురుగు కాలువల్లో జల దిగ్బంధం తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా సహాయక చర్యలను ముమ్మరం చేసి, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ సిబ్బందికి మేయర్ ఆదేశాలు జారీ చేశారు.

# స్వచ్ఛ కరీంనగర్ మా లక్ష్యం.. సమగ్రాభివృద్ధే మా ధ్యేయం





- **డంపింగ్ యార్డు సమస్యకు రూ.17 కోట్లతో శాశ్వత పరిష్కారం**
- **వారంలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం: బండి సంజయ్ కుమార్**

**కరీంనగర్, సెప్టెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు ):** స్వచ్ఛ కరీంనగర్ నిర్మాణంతో పాటు నగర సమగ్రాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం పారిశుధ్య కార్మికులకు నూతన ట్రైసైకిళ్ల పంపిణీ, ఫాగింగ్ యంత్రాల ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పాలకవర్గ సభ్యులతో కలిసి బండి సంజయ్ కుమార్ 66 పారిశుధ్య ట్రైసైకిళ్లను, రెండు ఫాగింగ్ యంత్రాలను ప్రారంభించారు. డివిజన్‌కు ఒకటి చొప్పున ట్రైసైకిళ్లను పారిశుధ్య కార్మికులకు అందజేశారు.నగర పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ట్రైసైకిళ్లు, ఫాగింగ్ యంత్రాలతో పాటు ట్రాక్టర్లు, కొత్త జేసీబీలు, వైకుంఠ రథాలను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అంతర్గత రహదారుల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులతో పనులు చేపడుతున్నామని, నగర ప్రజలను చాలాకాలంగా వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు రూ.17 కోట్ల వ్యయంతో శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. వారంలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ముందుకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

# తెలంగాణ ఉద్యమ కెరటం సాయిచంద్

- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**



**వనపర్తి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** తన పాటల ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రజలను చైతన్యపరిచి, ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన ఉద్యమ కెరటం, ప్రముఖ గాయకుడు స్వర్గీయ సాయిచంద్ అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ కొనియాడారు.సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్టీఆర్ లలిత కళా తోరణంలో సాయిచంద్ 43వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో ధూంధాం కార్యక్రమాల ద్వారా సాయిచంద్ తన మాట, పాట, ఆటలతో తెలంగాణ వ్యాప్తంగా ప్రజలను ఉర్రూతలూగించారని గుర్తుచేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో తన గానంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు ఉద్యమ ఆకాంక్షలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారుడిగా సాయిచంద్ ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా కూడా ఆయన అందించిన సేవలు అభినందనీయమని శంకర్ గౌడ్ పేర్కొన్నారు.సాయిచంద్ తన కళ ద్వారా తెలంగాణ ఉద్యమానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మాటలు, పాటలు తెలంగాణ ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయని అన్నారు. ఆయన ఆశయాలను, తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శంకర్ గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు జనజ్వాల, బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు యాదవ్, బండారు శ్రీనివాస్, డా. గంధం నాగరాజు, డా. శ్యాంసుందర్, బొజ్జిబాబు, తిరుపతయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మానవ హక్కుల పరిరక్షణకు మారపల్లి రాజేష్



**జమ్మికుంట, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఇండియన్ హ్యూమన్ రైట్స్ ఆర్టీఐ కౌన్సిల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మారపల్లి రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ అధిష్ఠానం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు రాజేష్ తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన సంస్థ జాతీయ చైర్మన్ అఖిలేష్ రెడ్డి, తెలంగాణ అధ్యక్షుడు బతుల శంకర్, రాష్ట్ర ఇన్‌చార్జి కొంగంటి రాజ్‌కుమార్‌కు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.
జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)పై ప్రజలకు మరింత అవగాహన కల్పించడంతో పాటు మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం విస్తృత కార్యక్రమాలు చేపడతామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. రాజేష్ నియామకాన్ని స్వాగతిస్తూ పలువురు ప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు.

# కలెక్టరేట్ లో నేడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు...

- **జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ఖమ్మం, సెప్టెంబర్- 20, (తెలంగాణ ముచ్చట్లు):** నేడు ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య పరిపాలనా కారణాల రీత్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల, డివిజన్ల స్థాయిలో నిర్వహించబడే ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా సోమవారం మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడుతుందని కలెక్టర్ అన్నారు. ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.




# రాజయ్యకు కళ్లు మూసుకుపోయాయా?

- **రాజయ్యపై కనకం రమేష్ ఫైర్**

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర న్యాయ విభాగం కన్వీనర్ కనకం రమేష్ తీవ్రంగా స్పందించారు. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు..... దానం నాగేందర్‌పై వేటుతో ఒక్క వికెట్ పడిందని, తర్వాత కడియం అంటూ రాజయ్య చేసిన వ్యాఖ్యలను కనకం రమేష్ ఖండించారు. ఇదేమీ క్రికెట్ ఆట కాదని, కడియం శ్రీహరిపై మరోసారి విమర్శలు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. కడియం అంటే బ్రాండ్, కమిట్‌మెంట్ అని వ్యాఖ్యానించారు.

నియోజకవర్గంలో అభివృద్ధి కనిపించడం లేదా?

నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, సమీకృత కార్యాలయ సముదాయం పనులు వేగంగా కొనసాగుతున్నాయని కనకం రమేష్ తెలిపారు. సాగునీటి ద్వారా రైతులకు నీరు అందుతున్నప్పటికీ అభివృద్ధి రాజయ్యకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి మాట్లాడాలని సూచించారు.

కావ్యపై వ్యాఖ్యలు సరికాదు

ఎంపీ కడియం కావ్య పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని, మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కనకం రమేష్ అన్నారు. ప్రజా సమస్యలపై పనిచేస్తున్న ప్రజాప్రతినిధులను విమర్శించే ముందు వారి సేవలను గుర్తించాలని సూచించారు.

దళితులపై రాజయ్య వైఖరి ఏమిటి?

దళిత స్పీకర్‌ను అసెంబ్లీలో అవమానించిన సమయంలో రాజయ్య ఎందుకు స్పందించలేదని కనకం రమేష్ ప్రశ్నించారు. దళితుల సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే అప్పుడే స్పందించి ఉండాల్సిందన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ వయసులోనూ విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి పనులను పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. కడియం శ్రీహరిపై వ్యక్తిగత విమర్శలు చేస్తే కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ప్రతిఘటిస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుందూరు వెంకట్ రెడ్డి, సింగాపురం వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్, గుర్రం ఫాతి కుమార్, ఆరవ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాస్కుల ఎల్లయ్య, తోకల సమ్మయ్య, బాస్కుల కుమార్, రమణాచారి, తాటికొండ (సున్నం) యాదగిరి, 13వ వార్డు అధ్యక్షుడు గద్దల యాదగిరి, చేపూరి కొమురయ్య, రాజేష్, సోన్నాయిల శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రుల సందర్భంగా మహా అన్నప్రసాద వితరణ

**ధర్మసాగర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఎలుకుర్తి దేవాలయ సముదాయంలో గణపతి నవరాత్రుల సందర్భంగా మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధర్మసాగర్ సీఐ ఏ. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో



పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందుతాయని అన్నారు. మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎలుకుర్తి గ్రామ సర్పంచ్ నరిశెట్టి సుధాకర్, దేవాలయాల కమిటీ చైర్మన్ శ్రీధర్ల ధర్మేంద్ర, గుండవరం హరిబాబు, బేరా విజేందర్, సాయం సందీప్, బేరా లక్ష్మణ్, గుండు రాజకుమార్, పాండ్యాల రమేశ్, అచ్చ రమేష్, తాటిపెల్లి రమేష్, బేరా హరీష్, కోటే సతీష్, బేరా రాజేష్, శ్రీధర్ల బుచిమల్లు, యువత ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు


# ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలో రూ.87 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- **లబ్ధిదారులకు అందజేసిన పార్లమెంట్ సభ్యులు రామసహాయం**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు ):** పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఖమ్మంలోని ఘట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి హాజరై.. లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్ ) చెక్కులను పంపిణీ చేశారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన..220మందికి రూ.87 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా.. కాంగ్రెస్ నేతలు మద్దినేని స్వర్ణకుమారి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పార్టీ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.







# ఖమ్మంలో పేదల ఇళ్ల కూల్చివేతను తీవ్రంగా నిరసిస్తున్నాం

- **మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**
- **పేదల పక్షాన బీఆర్ఎస్ ఎప్పుడు పోరాడుతుంది..పువ్వాడ**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 20(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రభుత్వంలో అధికారుల సమన్వయ లోపం, పాలకుల నిర్లక్ష్యం వల్ల పేద ప్రజల ఇళ్లను ఇష్టమొచ్చినట్లు కూల్చివేస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో కేసీఆర్ లేరని, పువ్వాడ అజయ్ కుమార్ లేరని భావించి, పేదల ఇళ్లకు రక్షణ లేకుండా చేసి కూల్చివేస్తున్నారని విమర్శించారు. ఖమ్మం శ్రీనివాస నగర్ పేదల ఇళ్ల కూల్చివేత దారుణం వెలుగుమట్లలో పేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను అర్ధరాత్రి వేళ నేలమట్టం చేసి, గుట్టలుగా మార్చడం చాలా బాధాకరమైన విషయం. ఖమ్మంలో రెక్కాడితే గానీ డొక్కాడని పేద ప్రజలు ఖాళీ స్థలాల్లో గూడు ఏర్పాటు చేసుకుంటే, గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి దాదాపు 3000 మంది పేదలకు జి ఓ 58 ద్వారా స్థల క్రమబద్ధీకరణ (పట్టాలు) అందించడం జరిగింది. వెలుగుమట్ల, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో పేదలు నివసిస్తున్న స్థలాలను కేసీఆర్ స్వయంగా పరిశీలించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని ప్రతిపాదించినా, పేదలు తమ స్థలాలే తమకు కావాలని కోరడంతో, వారున్న స్థలాలకే క్రమబద్ధీకరణ పట్టాలు ఇవ్వడం జరిగింది. 2014 నాటి జి ఓ 58 ని మళ్లీ 2023 ఫిబ్రవరిలో పొడిగించి, ఖమ్మంలో అర్హులైన పేదలందరికీ కలెక్టర్ సంతకంతో కూడిన పట్టాలను అందించాం.
హైకోర్టు పాత ఆర్డర్ ఆధారంగా అధికారులు చర్యలు తీసుకుంటున్న వేళ, బి ఆర్ ఎస్ పార్టీ లీగల్ సెల్ తరపున న్యాయవాదులు రవీందర్, ఖమ్మం బిడ్డ నిరోష కోర్టులో నిలబడి పేదల తరుపున గళం విప్పారు. అధికారుల దృష్టికి వెళ్లని ఈ జి ఓ 58 పట్టాల వాస్తవాన్ని కోర్టు ముందుంచారు. శ్రీనివాసనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో 696 మంది పేద కుటుంబాలు లబ్ధి పొందిన విషయాన్ని కమిషనర్, ఉన్నతాధికారులు గుర్తించారని తెలిపారు. పేద ప్రజలను కాపాడాలని న్యాయస్థానాన్ని, అధికారులను చేతులు జోడించి వేడుకుంటున్నాను. కోర్టు ఆదేశించినట్లుగా వారం రోజుల్లో సరైన నివేదికను తయారుచేసి, నిరుపేదలకు న్యాయం చేయాలని, వారు కట్టుకున్న ఇళ్లకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. కార్యక్రమంలో ఆర్ జె సి కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్ కుమార్, పాలడుగు పాపారావు, మాటేటి నాగేశ్వరరావు, మండడుపు రామకృష్ణ, ఖయుమ్, మెంతుల శ్రీశైలం, దడాల రఘు, మస్తాన్, వెంకటేశ్వర్లు, మాటూరి లక్ష్మి నారాయణ, లెలిన్ లీగల్ సెల్ నిరోషా, తిరుమల్ రావు, సుగుణ రావు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులు సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాలి

- **మాజీ ఎమ్మెల్యే రాజయ్య**

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్‌పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమంపై మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాలని రాజయ్య పిలుపునిచ్చారు. కార్మి




కుల హక్కుల సాధనకు ఐక్యత ఎంతో అవసరమని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, కార్మిక సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి కార్మికుడికి అందేలా కృషి చేయాలని సూచించారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యను గుర్తించి వాటి పరిష్కారానికి సంఘం నాయకులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలన్న, రాష్ట్ర కోశాధికారి, ఘన్‌పూర్ మున్సిపాలిటీ మొదటి వార్డు కౌన్సిలర్ తాటికొండ మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురుగు యాదగిరి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేములకొండ సంపత్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సూర వెంకన్న, జనగామ జిల్లా అధ్యక్షుడు వాతల యాదగిరి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు రాజేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మూల వీర నరసింహులు, స్టేషన్ ఘన్‌పూర్ మండల ఉపాధ్యక్షుడు కలకోల ఎల్లయ్య, మండల కార్యదర్శి తాటికొండ బాలకృష్ణ, సహాయ కార్యదర్శి చింత లింగయ్య, శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

# వల్బపూర్‌లో గణపతి మహాసేన క్రికెట్ టోర్నమెంట్

**ఎల్కతుర్తి , సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** వల్బపూర్ గ్రామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2026 గణపతి మహాసేన క్రికెట్ టోర్నమెంట్ను ఘనంగా నిర్వహించారు. టోర్నమెంట్‌ను ఎల్కతుర్తి ఎస్ఐ నర్సింహారావు ప్రారంభించారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు జిల్లా ఉపసర్పంచుల ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షులు అంబాల అనిల్, కమలాపూర్ మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు శనిగరపు రమేష్, అడ్వకేట్ పవన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ నర్సింహారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. యువత క్రీడలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు.
టోర్నమెంట్‌లో వివిధ జట్లు ఉత్సాహంగా పాల్గొని హోరాహోరీగా తలపడ్డాయి. క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రేక్షకులను అలరించారు. చివరకు సృజన్ జట్టు విజేతగా, అభిలాష్ జట్టు రన్నరప్‌గా నిలిచాయి. విజేతలు, రన్నరప్ జట్లకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో ఆర్గనైజర్లు అంబాల సృజన్, అంబాల అభిలాష్, సందీప్, అఖిల్, దయాకర్, వంశీ, శ్రీకాంత్, మహేష్, తరుణ్‌తో పాటు పలువురు యువకులు కీలక పాత్ర పోషించారు. గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.



## వందేభారత్ కిందపడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్టేషన్ ఘన్‌పూర్-నష్కల్ రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసున్న మహిళ 20833 నంబర్ గల వందేభారత్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వివరాలు, ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## నాడు విమర్శలు.. నేడు చంద్రబాబు విజన్‌కు ప్రశంసలు

- **తెలంగాణలోనూ చంద్రబాబు లాంటి నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు**
- **పెద్దమందడి టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి**



**పెద్దమందడి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** ఒకప్పుడు రాజకీయంగా చంద్రబాబు నాయుడిని విమర్శించిన నాయకులే నేడు ఆయన విజన్‌ను, హైదరాబాద్ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ ప్రశంసిస్తున్నారని టీడీపీ వనపర్తి జిల్లా పెద్దమందడి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చంద్రబాబు నాయుడి దూరదృష్టితో తీసుకున్న అభివృద్ధి నిర్ణయాలు హైదరాబాద్ ప్రగతికి దోహదపడ్డాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలోనూ చంద్రబాబు నాయుడు లాంటి దూరదృష్టి కలిగిన నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలో చంద్రబాబుపై వివిధ రాజకీయ పార్టీలు చేసిన విమర్శలు అభివృద్ధి నిర్ణయాలపై కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసమే జరిగాయని ఆయన అభిప్రాయపడ్డారు. చంద్రబాబు నాయుడు రాజకీయంగా తీర్చిదిద్దిన నాయకత్వంలో ఎదిగిన పలువురు నేతలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో వివిధ పార్టీల్లో ఉన్నారని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాడు విమర్శించిన నాయకులే నేడు ఆయన ప్రస్తావించిన అభివృద్ధి, సాగునీరు, మౌలిక వసతుల అంశాలను గుర్తు చేసుకోవడం మారుతున్న రాజకీయ పరిస్థితులకు నిదర్శనమని పేర్కొన్నారు.ఇటీవల పెబ్బేరులో సాగునీటి సమస్యలపై మాట్లాడిన సందర్భంగా కేటీఆర్ చంద్రబాబు నాయుడి పేరును ప్రస్తావించడం కూడా ఇదే నేపథ్యంలో చూడాలని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పరస్పర విమర్శలు కొనసాగుతున్న సమయంలో ప్రజలు అభివృద్ధి, పాలన, దీర్ఘకాలిక ప్రణాళికలపై చర్చిస్తున్నారని తెలిపారు.తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి బలమైన రాజకీయ పునాది, క్షేత్రస్థాయిలో కార్యకర్తల బలం ఉందని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పార్టీ అధికారంలో లేకపోయినా తెలుగుదేశం పార్టీని అభిమానించే వర్గాలు, కార్యకర్తలు తమ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ తెలంగాణలో మరింత బలోపేతమై పూర్వ వైభవం సాధిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో మళ్లీ రాజకీయంగా ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉందని అన్నారు.ప్రస్తుతం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, కొత్త ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని పేర్కొంటూ, తెలంగాణలోనూ అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చే నాయకత్వంపై ప్రజల్లో చర్చ జరుగుతోందని అన్నారు.

## అక్టోబర్ 2న మద్యపాన నిషేధం కోరుతూ కలెక్టరేట్ ముట్టడి



- **అక్టోబర్ 7న జాతీయ సదస్సును విజయవంతం చేయాలి**

**ధర్మసాగర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మద్యపాన నిషేధం కోరుతూ అక్టోబర్ 2న హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా కో ఇంచార్జి తడుగుల విజయ మాదిగ పిలుపునిచ్చారు. అక్టోబర్ 7న ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద గంగారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ, తడుగుల విజయ మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యపాన నిషేధం కోసం అక్టోబర్ 2న హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి ధర్మసాగర్ మండలంలోని ప్రతి గ్రామం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే అక్టోబర్ 7న అమరావతిలో జరిగే జాతీయ సదస్సుకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల అధికార ప్రతినిధి వక్కల అక్షిత్ మాదిగ, సీనియర్ నాయకులు పొడిశెట్టి ప్రతాప్ మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకుడు పొడిశెట్టి సురేందర్ మాదిగ, మండల ప్రధాన కార్యదర్శులు నమిండ్ల ప్రభుదాస్ మాదిగ, తాటికాయల అశోక్ మాదిగ, కనకం అనిల్ మాదిగ, మండల ఉపాధ్యక్షుడు సింగారపు దిలీప్ మాదిగ, కోశాధికారి నక్క ప్రవీణ్ మాదిగ, కార్యదర్శులు వక్కల రూషన్ మాదిగ, తాటికాయల శంకర్ మాదిగ, సాయిపేట గ్రామ అధ్యక్షుడు సోంపల్లి రాజేందర్ మాదిగ, ఉపాధ్యక్షుడు సోంపల్లి ప్రవేశ్ మాదిగ, కోశాధికారి ఇమ్మడి ప్రమోద్ మాదిగ, ఎంఎస్పీ సాయిపేట గ్రామ అధ్యక్షుడు సోంపల్లి ప్రవీణ్ మాదిగ, అధికార ప్రతినిధి గంగారపు కుమారస్వామి మాదిగ, కోశాధికారి సోంపల్లి సోక్కయ్య మాదిగ, సహాయ కార్యదర్శి సోంపల్లి సంపత్ మాదిగ, చిలక రాకేష్ మాదిగ, రవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల కుంకుమార్చనతో మార్మోగిన గణపతి మండపాలు





- **అన్నదానంతో నిండిన భక్తి పారవశ్యం**

**స్టేషన్ ఘన్‌పూర్ / చిల్పూర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూర్ మండలాల్లో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ఆదివారం పలు వినాయక మండపాల్లో మహిళల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో...

పట్టణంలోని విద్యానగర్ కాలనీలో బ్రదర్స్ యూత్ అసోసియేషన్, రైల్వే కాలనీలోని విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్, శివునిపల్లి బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఉన్న స్వచ్ఛంద శాశ్వత సభ్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచే కుంకుమ పూజలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు పాల్గొని గణనాథుడికి కుంకుమార్చన చేశారు.

శివునిపల్లి బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గోశాల చిందుజ కృష్ణమూర్తి దంపతులు, సముద్రాల ఓరుగంటి శ్రీనివాస్-చంద్రకళ దంపతులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోమటిగూడెంలోని శ్రీ జై గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, అలాగే మీదికొండ, పాము నూరు గ్రామాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నవిలిగొండ గ్రామంలో సర్పంచ్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 'ఇరుముడి' సినిమాను ప్రదర్శించారు.

చిల్పూర్ మండలంలో...

చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాలలో భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్, నష్కల్‌లో ఛత్రపతి శివాజీ యువసేన కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తి పాటలతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జగత్‌పల్లిలో రూ.లక్ష పలికిన గణేశుడి లడ్డూ

- **వేలంలో దక్కించుకున్న నిరేటి చంద్రయ్య–కళావతి దంపతులు**



**పెద్దమందడి,సెప్టెంబర్20(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శనివారం సాయంత్రం లడ్డూ వేలం ఉత్కంఠభరితంగా సాగింది. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు పలువురు పోటీపడగా, గ్రామానికి చెందిన నిరేటి చంద్రయ్య-కళావతి దంపతులు రూ.లక్షకు వేలంలో దక్కించుకున్నారు.లడ్డూ వేలంలో పలువురు ఉత్సాహంగా పాల్గొనడంతో మండపం వద్ద సందడి నెలకొంది. చివరకు నిరేటి చంద్రయ్య-కళావతి దంపతులు రూ.లక్షకు లడ్డూను సొంతం చేసుకున్నారు. అనంతరం గణేష్‌మండపం నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూ ప్రసాదాన్ని దంపతులకు అందజేశారు.ఈ సందర్భంగా చంద్రయ్య-కళావతి దంపతులు మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి కృప, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.

## కమల్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**నిజామాబాద్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్ఆర్ ఇంపల్స్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన కమల్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది.

తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ అవార్డు కార్యక్రమంలో ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చందర్ లాల్ నాయక్ కమల్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చందర్ లాల్ నాయక్ మాట్లాడుతూ విద్యారంగానికి కమల్ అందిస్తున్న అంకితభావం, నిబద్ధత, నైపుణ్యం, సృజనాత్మకతతో పాటు విద్యార్థుల పట్ల చూపుతున్న ఆప్యాయత, బాధ్యత, ఆదర్శవంతమైన సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందిస్తూ వారి ప్రతిభను వెలికితీసి, విలువలతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కమల్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు.తరగతి గదికే పరిమితం కాకుండా సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడిగా విలువైన పాత్ర పోషిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఉన్నత విద్య, విలువలను అందిస్తున్నందుకు కమల్‌ను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్కరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిందం ప్రకాష్, పసక సంధ్య, నవీత, కళ్యాణి, గంగాధర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## దమ్మైగూడ యష్ ఆర్కేడ్‌లో ఘనంగా గణేష్ నిమజ్జనం

- **అధ్యక్షుడు రవిశంకర్ సమన్వయంతో భక్తిశ్రద్ధలతో వేడుకలు.. రూ.25,016కు లడ్డూ వేలం..**



**దమ్మైగూడ, సెప్టెంబర్ 20 ( తెలంగాణ ముచ్చట్లు):** దమ్మైగూడ యష్ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో గణేష్ నవరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి.

అసోసియేషన్ అధ్యక్షుడు రవిశంకర్ సమన్వయంతో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అపార్ట్‌మెంట్‌లోని టెనెంట్లు, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలంపాటకు విశేష స్పందన లభించింది.

వేలంపాటలో పలువురు ఉత్సాహంగా పాల్గొనగా, రూ.25,016కు కీర్తి జయసుధ శివప్రసాద లడ్డూను దక్కించుకున్నారు.

అపార్ట్‌మెంట్ వాసులు తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధ్యక్షుడు రవిశంకర్‌తో పాటు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేశారు. కార్యదర్శి జిత్తు, కమిటీ సభ్యులు సీమ, అరుణ్‌కుమార్, కట్ట కిరణ్, సూర్యకిరణ్, మెరుగు శివ తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో అపార్ట్‌మెంట్ వాసుల ఐక్యత, సమిష్టి భాగస్వామ్యం ప్రతిబింబించింది. ఈ సందర్భంగా బలగం టీవీ సీఈఓ విజయ్‌కుమార్, స్టార్ న్యూస్ టీవీ9 రఘు, నిమ్మిచన్ పవర్ లను శాలువాలతో సన్మానించారు. భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన గణేష్ వేడుకలు నిమజ్జన కార్యక్రమంతో ప్రశాంతంగా ముగిశాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# తేజస్‌లో జపాన్ వాయుసేన చీఫ్

- భారత్–జపాన్ సంయుక్త విన్యాసాల్లో కీలక ఘట్టం
- జపాన్ చీఫ్‌తో కలిసి ప్రయాణించిన ఐఏఎఫ్ చీఫ్
- జోధ్‌పుర్‌లో వీర్ గార్డియన్–2026 విన్యాసాలు

**జోధ్‌పుర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** భారత్‌కు చెందిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్‌లో జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ అధిపతి జనరల్ టకెహిరో మొరిటా ప్రయాణించారు. భారత వాయుసేన చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కూడా ఆయనతో కలిసి తేజస్‌లో ప్రయాణించారు.భారత్-జపాన్ ద్వైపాక్షిక వాయుసేన సంయుక్త విన్యాసాలు 'వీర్ గార్డియన్-2026'లో భాగంగా ఆదివారం జోధ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ కార్యక్రమం నిర్వహించారు. భారత పైలట్‌తో కలిసి జనరల్ టకెహిరో మొరిటా తేజస్‌లో ప్రయాణించగా, ఐఏఎఫ్ చీఫ్ మరో తేజస్ విమానాన్ని స్వయంగా నడిపారు.ఈ సంయుక్త విన్యాసాల్లో ఇరు దేశాల వాయుసేనలు యుద్ధ వ్యూహాలు, కార్యకలాపాలపై పరస్పరం అవగాహన పంచుకున్నాయి. భారత వాయుసేన తరఫున సుఖోయ్-30 ఎంకేఐ, రఫేల్, ఎల్‌సీఏ తేజస్ యుద్ధవిమానాలు పాల్గొనగా.. జపాన్ వాయుసేన తరఫున ఎఫ్-2ఏ ఫైటర్ జెట్ పాల్గొంది.




# సైబర్ మోసగాళ్ల వలలో డిజిటల్ బీమా సేవలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** డిజిటల్ విధానంలో మొబైల్ ఫోన్ల ద్వారా జీవిత బీమా పాలసీలు కొనడం, ప్రీమియంలు చెల్లించడం సులభతరమవ్వడంతో పాటు అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. నకిలీ కాల్స్, మెసేజ్‌లు, చెల్లింపుల లింక్‌లను ఉపయోగించి నేరగాళ్లు పాలసీదారులను బుట్టలో వేసుకుంటున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలు మరియు పాలసీ సమాచారాన్ని తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచిస్తున్నారు. ముఖ్యంగా పాత లేదా యాక్టివ్‌గా లేని పాలసీలకు భారీగా బోనస్ వచ్చిందంటూ, ఆ మొత్తం విడుదల కావాలంటే కొంత రుసుము చెల్లించాలని నమ్మబలుకుతున్నారు. అలాగే ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ సంస్థలు లేదా ప్రభుత్వ అధికారులమంటూ ఫోన్ చేసి రికార్డుల వెరిఫికేషన్ పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. ఫోన్ కాలర్ ఐడీ లేదా పంపే నకిలీ పత్రాలను గుడ్డిగా నమ్మవద్దని, ఏదైనా సందేహం ఉంటే బీమా సంస్థల అధికారిక వెబ్‌సైట్ లేదా కస్టమర్ కేర్ నంబర్ల ద్వారానే వివరాలను ధ్రువీకరించుకోవాలని నిపుణులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చికెన్ ధరలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో చికెన్ ధరలు ఒక్కసారిగా ప్రియమయ్యాయి. గడిచిన వారంతో పోలిస్తే విపణిలో డిమాండ్‌కు అనుగుణంగా కిలో చికెన్‌పై రూ. 20 నుంచి రూ. 30 వరకు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ. 250 నుంచి రూ. 265 వరకు విక్రయమవుతుండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కిలో రూ. 230 నుంచి రూ. 260 వరకు పలుకుతోంది. అటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో కిలో చికెన్ ధర అత్యధికంగా రూ. 270 దాటగా, విశాఖపట్నంలో రూ. 250, అనకాపల్లిలో రూ. 260 వద్ద విక్రయాలు జరుగుతున్నాయి. కోళ్ల పెంపకంలో ఉత్పత్తి వ్యయం పెరగడం, ఫారాల నుంచి సరఫరా తగ్గడమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని వ్యాపార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# స్టేషన్ ఘనపూర్‌లో 20 అడుగుల భారీ గణనాథుడు







- రూ.85 వేలతో ప్రత్యేకంగా ఏర్పాటు..
- భక్తులను ఆకట్టుకుంటున్న గణపయ్య
- జై హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు..
- ఇరుముడి సినిమా ప్రదర్శన

**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని నాలుగో వార్డులో జై హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల భారీ గణనాథుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. సుమారు రూ.85 వేల వ్యయంతో ప్రత్యేకంగా తయారు చేయించిన గణపతి విగ్రహానికి ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ, పూల అలంకరణతో మండపాన్ని అందంగా తీర్చిదిద్దారు.

సినిమా ప్రదర్శనతో ప్రత్యేక ఆకర్షణ

ఉత్సవాల్లో భాగంగా నాలుగో వార్డు కౌన్సిలర్ బూర్ల రాజేశ్వర్ ఆధ్వర్యంలో భక్తులకు వినోదంతో పాటు భక్తి భావనను కలిగించేలా 'ఇరుముడి' సినిమా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.8 వేల వ్యయంతో ప్రత్యేక వాహనంలో భారీ తెరను ఏర్పాటు చేసి సినిమా ప్రదర్శించారు.

సినిమా వీక్షించేందుకు చిన్నారులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భారీ గణనాథుడి దర్శనంతో పాటు సినిమా ప్రదర్శన ఏర్పాటు చేయడంతో నాలుగో వార్డు వినాయక మండపం పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు ఉద్యమిస్తాం

- మాదిగ జర్నలిస్టుకు ఎస్సీ కమిషన్‌లో ప్రాతినిధ్యం కల్పించాలి
- తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ




**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ అన్నారు. ఆదివారం హైదరాబాద్ కోఠిలోని బీసీ సాధికారిక భవన్‌లో నిర్వహించిన ఫోరం రాష్ట్ర నూతన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, ఇంటి స్థలాలు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ కమిషన్‌లో మాదిగ జర్నలిస్టుకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వత్తుల రఘుపతి, గౌరవ సలహాదారులుగా పాల్వాయి బాలయ్య, జీలకర్ర కృష్ణకర్, ప్రేమ్ కుమార్, తిరుపతి, సుంచు లింగయ్యలను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బూర్గుల నాగేందర్, ప్రధాన కార్యదర్శిగా బొల్లెపాక రాజేష్, అధికార ప్రతినిధిగా పంగిడి చెరువు వెంకటేష్, కోశాధికారిగా సదానందంను ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా పానుగంటి సురేందర్, సుక్క అశోక్, అంకగళ్ల కరుణాకర్, పెండ్యాల సుమన్, దుబ్బ నాగేష్, కాటేపాక హుస్సేన్, పెద్దింటి శ్రీనివాస్, కడియం నాగయ్యలను, కార్యదర్శులుగా సర్వని శ్రీనివాస్, ఒగ్గు సోమయ్య, ఏర్పుల మహేష్, గంట వెంకన్న, నాగేశ్వరరావు, కుమ్మరి ముఖేష్, చల్మెడ అనిల్, అడిగమోహన్, శ్రీమన్నారాయణ, గూడూరు కరుణాకర్, బిక్షపతిని ఎన్నుకున్నారు.కార్యవర్గ సభ్యులుగా కేశపాగ శ్రీను, వంగాల అవినాష్, జయరాజు, మంచాల అనిల్, మహారాయుడు, పూర్ణచందర్, జింక శ్రీధర్, బొల్లె రాజన్న, చదలవాడ సూరి, గోవిందు, గంగరాజు తదితరులను ఎన్నుకున్నారు.

# బ్యాంకుల సమ్మె




**ముంబై సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా బ్యాంకులు సమ్మెకు దిగనున్నాయి. సెప్టెంబర్ 26, 27 తేదీలు శని, ఆదివారాలు కావడం, దాని వెంటనే మూడు రోజుల సమ్మె కొనసాగనుండటంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖలలో భౌతిక సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బీఐ తమ ఖాతాదారులను హెచ్చరించింది. తమ డిమాండ్ల సాధన కోసం యూఎఫ్‌బీయూ ఇప్పటికే సెప్టెంబర్ 11న ఒకరోజు సమ్మె నిర్వహించగా, ఇప్పుడు సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు రెండో విడత నిరసన చేపట్టనుంది. డిమాండ్లు పరిష్కారం కాకపోతే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని యూనియన్లు ప్రకటించాయి. సమ్మె కారణంగా చెక్కుల క్లియరెన్స్, పత్రాల పరిశీలన వంటి ప్రత్యక్ష సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున, ఏటీఎంలు, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ మరియు యోనో వంటి డిజిటల్ సేవలనే వినియోగించుకోవాలని ఎస్‌బీఐ సూచించింది.

# ఈపీఎఫ్ బీమా కవరేజీ




**న్యూఢిల్లీ సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) వేతన పరిమితి పెంపునకు తగినట్లుగా ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్ఐ) పథకం కింద లభించే జీవిత బీమా ప్రయోజనాలను పెంచకపోవడంపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని నెలకు రూ. 15,000 నుంచి రూ. 25,000 కు పెంచినప్పటికీ, ఈడీఎల్ఐ ఉచిత బీమా గరిష్ఠ కవరేజీని మాత్రం పెంచలేదు. దీంతో ఉద్యోగ భవిష్య నిధి ఖాతాదారులు దాదాపు రూ. 3.50 లక్షల వరకు జీవిత బీమా రక్షణను కోల్పోవాల్సి వస్తోంది. సాధారణంగా ఈపీఎఫ్ ఖాతా కలిగిన ప్రతి ఉద్యోగికి ఈడీఎల్ఐ ద్వారా ఉచిత జీవిత బీమా సౌకర్యం లభిస్తుంది. సర్వీస్‌లో ఉండగా ఉద్యోగి దురదృష్టవశాత్తు మరణిస్తే, వారి కుటుంబ సభ్యులకు లేదా నామినీకి ఈ బీమా పరిహారం అందుతుంది. దీనికి సంబంధించి ఉద్యోగి పనిచేసే సంస్థే నెలనెలా ప్రీమియం చెల్లిస్తుంది. గతంలో బేసిక్ పే మరియు డీఏలో 0.5 శాతంగా ఉన్న గరిష్ఠ ప్రీమియం రూ. 75 నుంచి రూ. 125 కు పెరిగినప్పటికీ, మరణానంతరం లభించే బీమా మొత్తంలో మార్పు లేదు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం కనీస బీమా పరిహారం రూ. 2.50 లక్షలుగా, గరిష్ఠ బీమా పరిహారం రూ. 7 లక్షలుగా ఉంది. 2014 సెప్టెంబర్‌లో వేతన పరిమితిని రూ. 15,000 కు పెంచిన సమయంలో గరిష్ఠ బీమాను రూ. 6 లక్షలకు సవరించారు. ఆ తర్వాత 2021 ఏప్రిల్‌లో దీనిని ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా రూ. 7 లక్షలకు పెంచారు. ఇప్పుడు వేతన పరిమితి రూ. 10,000 వరకు పెరిగినందున, బీమా పరిమితిని కూడా రూ. 10.50 లక్షలకు పెంచాలని కార్మిక సంఘాలు మరియు ఆర్థిక నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బీమా పరిమితి పెంపుపై నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆసియా క్రీడల్లో భారత మహిళల విజయం




**ఐచి-నాగోయా సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** ఏషియన్ గేమ్స్ 2026లో భారత మహిళల హాకీ జట్టు శుభారంభం చేసింది. ఆదివారం గిఫు ప్రిఫెక్చురల్ గ్రీన్ స్టేడియంలో ఉజ్బెకిస్థాన్‌తో జరిగిన తొలి గ్రూప్ మ్యాచ్‌లో భారత జట్టు 190 గోల్స్ భారీ తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత క్రీడాకారులు ప్రత్యర్థి జట్టుకు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. భారత జట్టు విజయంలో దీపిక ఎనిమిది గోల్స్‌తో అత్యుత్తమ ప్రదర్శన కనబరచగా, ఇషిక మూడు, నవనీత్ కౌర్ రెండు, లాల్‌థంత్లువాంగి రెండు గోల్స్ సాధించారు. లాల్‌రెమ్‌సియామి, బాల్జీత్ కౌర్, నేహా, సాక్షి రాణా తల ఒక గోల్ చేశారు. మ్యాచ్ ఆరో నిమిషంలో లాల్‌రెమ్‌సియామి గోల్‌తో పాయింట్ల ఖాతా తెరవగా, తొలి రెండు క్వార్టర్లు ముగిసేసరికి భారత్ 50 ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకుంటూ దీపిక చెలరేగిపోయింది. ఉజ్బెకిస్థాన్ జట్టు మొత్తం మ్యాచ్‌లో కేవలం ఒక్క షాట్ మాత్రమే కొట్టగలిగింది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లో సెప్టెంబర్ 21న ఇండోనేషియాతో తలపడనుంది.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత హోదా

**దుబాయ్ సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్లు అసాధారణ ప్రదర్శనతో తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. మూడు ప్రధాన ఫార్మాట్లలో రెండింటిలోనూ భారత ఆటగాళ్లే నంబర్ 1 స్థానాల్లో నిలిచి ప్రపంచ వేదికపై దేశ కీర్తిని పెంచారు.వన్డే ఫార్మాట్‌లో భారత యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని విజయవంతంగా నిలబెట్టుకోగా, భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కూడా టాప్ ర్యాంకింగ్స్‌లో కొనసాగుతున్నారు. ఇక అత్యంత వేగవంతమైన టీ20 ఫార్మాట్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ప్రపంచ నంబర్ 1 బ్యాటర్‌గా తన హవా కొనసాగిస్తుండగా, యంగ్ సెన్సేషన్ అభిషేక్ శర్మ రెండో స్థానంలో నిలిచాడు. మరోవైపు సుదీర్ఘమైన టెస్టు క్రికెట్ ఫార్మాట్‌లో ఇంగ్లండ్ యువ సంచలనం హ్యారీ బ్రూక్ అగ్రస్థానంలో నిలవగా, స్టీవ్ స్మిత్, జో రూట్ తదుపరి స్థానాల్లో ఉన్నారు. మొత్తానికి టెస్టు మినహా పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో భారత్‌యే అగ్రగామిగా వెలుగుతోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# హింసకు బదులు సంభాషణలతో పరిష్కారాలు



- అంతర్జాతీయ శాంతి దినోత్సవం ప్రపంచానికి మార్గదర్శనం
- ప్రపంచ దేశాల మధ్య స్నేహబంధాల బలోపేతం

**డెస్క్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని నిర్వహిస్తారు. మానవాళి శాంతి, సామరస్యం, పరస్పర గౌరవంతో జీవించాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి ఈ ప్రత్యేక దినాన్ని ప్రకటించింది. దేశాల మధ్య యుద్ధాలు, సరిహద్దు వివాదాలు, ఉగ్రవాదం, అంతర్గత ఘర్షణలు వంటి సమస్యలు ప్రపంచ శాంతికి సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో ఈ దినోత్సవానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక వేదికలు శాంతి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. శాంతి అనేది కేవలం ఒక నినాదం కాదు, మానవ సమాజ మనుగడకు అత్యవసరమైన అవసరమనే విషయాన్ని ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే యుద్ధాలు మానవాళికి ఎంతటి నష్టాన్ని కలిగించాయో స్పష్టంగా తెలుస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధం, రెండో ప్రపంచ యుద్ధం, అనేక ప్రాంతీయ యుద్ధాలు లక్షలాది మంది ప్రాణాలను బలిగొన్నాయి. కోట్లాది కుటుంబాలు తమ ఆస్తులు, జీవనోపాధిని కోల్పోయాయి. యుద్ధాల ప్రభావం కేవలం సైనికులకే పరిమితం కాకుండా సాధారణ ప్రజల జీవితాలను కూడా తీవ్రంగా దెబ్బతీసింది. విద్య, ఆరోగ్యం, ఉపాధి, ఆర్థికాభివృద్ధి వంటి రంగాలు దశాబ్దాల పాటు వెనుకబడిపోయాయి. అందుకే ప్రపంచ దేశాలు శాంతిని అత్యంత విలువైన సంపదగా భావిస్తూ వివాదాల పరిష్కారానికి చర్చల మార్గాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని గుర్తిస్తున్నాయి. శాంతి అంటే కేవలం యుద్ధాలు లేకపోవడం మాత్రమే కాదు. సమాజంలో న్యాయం, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత కూడా శాంతికి ముఖ్యమైన అంశాలే. ఒక దేశంలో ప్రజలు భయాందోళనలు లేకుండా జీవించగలిగితే, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయగలిగితే, అవకాశాలు అందరికీ సమానంగా లభిస్తే అక్కడ నిజమైన శాంతి నెలకొన్నట్లే. పేదరికం, నిరుద్యోగం, వివక్ష, అసమానతలు కూడా సమాజంలో అసంతృప్తికి కారణమవుతాయి. కాబట్టి శాంతి సాధనలో సామాజిక న్యాయం కీలక పాత్ర పోషిస్తుంది. నేటి ప్రపంచంలో ఉగ్రవాదం, మతపరమైన విద్వేషాలు, జాతి ఘర్షణలు, రాజకీయ ఉద్రిక్తతలు అనేక దేశాలను ప్రభావితం చేస్తున్నాయి. చిన్న సంఘటనలు కూడా పెద్ద స్థాయి హింసకు దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల మధ్య పరస్పర అవగాహన, సహనం, సహజీవన భావనలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. భిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలను గౌరవించడం ద్వారా సామరస్యపూర్వక సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. శాంతి అనేది బలవంతంగా రుద్దేది కాదు, పరస్పర గౌరవంతో పెంపొందించేది. సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని మరింత దగ్గర చేసింది. అయితే అదే సమయంలో తప్పుడు ప్రచారం, ద్వేషపూరిత సందేశాలు, అపోహల వ్యాప్తి కూడా వేగంగా పెరుగుతున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా కొన్ని క్షణాల్లోనే సమాచారం ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతాయుతమైన సమాచార వినియోగం అత్యంత అవసరం. అసత్య ప్రచారం, విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే సందేశాలు సమాజ శాంతిని దెబ్బతీయగలవు. కాబట్టి ప్రతి పౌరుడు సమాచారాన్ని ధృవీకరించి మాత్రమే పంచుకోవడం ద్వారా శాంతి పరిరక్షణలో భాగస్వామి కావాలి. ప్రపంచ శాంతి సాధనలో విద్య కీలకమైన సాధనం. పాఠశాలల నుంచే విద్యార్థులకు సహనం, పరస్పర గౌరవం, మానవతా విలువలు బోధించాలి. పుస్తక జ్ఞానంతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందించాలి. భిన్న అభిప్రాయాలను గౌరవించడం, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడం, ఇతరుల భావాలను అర్థం చేసుకోవడం వంటి లక్షణాలు విద్య ద్వారా అభివృద్ధి చెందుతాయి. శాంతియుత సమాజ నిర్మాణానికి విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధంగా నిలుస్తుంది.యువత ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించే శక్తిగా నిలుస్తోంది. జనాభాలో పెద్ద భాగం యువతే కావడంతో వారి ఆలోచనలు, చర్యలు సమాజంపై ప్రభావం చూపుతాయి. యువత శాంతి, సామరస్యం, సహకార భావనలతో ముందుకు సాగితే సమాజంలో సానుకూల మార్పులు చోటుచేసుకుంటాయి. వివాదాలను హింసతో కాకుండా సంభాషణల ద్వారా పరిష్కరించుకోవడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, సమానత్వాన్ని ప్రోత్సహించడం ద్వారా యువత శాంతి దూతలుగా మారగలరు. ప్రపంచ శాంతి సాధనలో యువత పాత్రను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించలేము. పర్యావరణ పరిరక్షణ కూడా శాంతితో ముడిపడి ఉంది. నీరు, భూమి, సహజ వనరుల కోసం ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వివాదాలు జరుగుతున్నాయి. వాతావరణ మార్పులు, కరువు, వరదలు, ఆహార కొరత వంటి సమస్యలు భవిష్యత్తులో మరిన్ని ఘర్షణలకు దారితీయవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సహజ వనరులను సమర్థవంతంగా వినియోగించడం, పర్యావరణాన్ని కాపాడడం ద్వారా భవిష్యత్తు తరాలకు స్థిరమైన, శాంతియుత ప్రపంచాన్ని అందించవచ్చు. అందుకే శాంతి, పర్యావరణ పరిరక్షణ రెండూ పరస్పర అనుసంధానమైన అంశాలుగా మారాయి.ఐక్యరాజ్యసమితి ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం అనేక దశాబ్దాలుగా కృషి చేస్తోంది. వివిధ దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేయడం, శాంతి దళాలను పంపించడం, మానవతా సహాయం అందించడం వంటి కార్యక్రమాల ద్వారా శాంతి స్థాపనకు ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ ప్రపంచ శాంతి బాధ్యత కేవలం అంతర్జాతీయ సంస్థలపై మాత్రమే ఉండదు. ప్రతి దేశం, ప్రతి ప్రభుత్వం, ప్రతి సమాజం, ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. పరస్పర గౌరవం, సహనం, న్యాయం, మానవతా దృక్పథం ద్వారా మాత్రమే శాశ్వత శాంతి సాధ్యమవుతుంది. అంతర్జాతీయ శాంతి దినోత్సవం ప్రపంచ ప్రజలకు అత్యంత విలువైన సందేశాన్ని అందిస్తోంది. శాంతి అనేది ఒక రోజు జరుపుకునే అంశం కాదు, ప్రతిరోజూ ఆచరించాల్సిన జీవన విధానం. కుటుంబంలో, సమాజంలో, దేశంలో, ప్రపంచ స్థాయిలో శాంతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. హింసకు బదులుగా సంభాషణ, విద్వేషానికి బదులుగా స్నేహభావం, విభేదాలకు బదులుగా సహకారం అనే విలువలను అనుసరించినప్పుడే మానవాళి సురక్షితమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయగలదు. శాంతి ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, శాంతి ఉన్నప్పుడే మానవ జీవితానికి అసలైన అర్థం ఉంటుందని ఈ దినోత్సవం ప్రపంచానికి చాటిచెబుతోంది.

# ఒత్తిడి పెరుగుతోంది.. ప్రశాంతత దూరమవుతోందా?

- ఆధునిక జీవనశైలి కొత్త సవాళ్లు
- మానసిక ఆరోగ్యంపై పెరుగుతున్న ప్రభావం
- సమతుల జీవన విధానమే పరిష్కారం
- వ్యక్తి, కుటుంబం, సమాజం కలిసి కృషి అవసరం



**డెస్క్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు)** నేటి ప్రపంచంలో సాంకేతిక అభివృద్ధి, వేగవంతమైన జీవనశైలి, పెరుగుతున్న పోటీ పరిస్థితులు మనిషి జీవితాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేస్తున్నాయి. గతంతో పోలిస్తే జీవన సౌకర్యాలు పెరిగినప్పటికీ మానసిక ప్రశాంతత మాత్రం తగ్గిపోతున్నదనే అభిప్రాయం బలపడుతోంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు దాదాపు ప్రతి వయస్సు వర్గానికి చెందిన వారు ఏదో ఒక రూపంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ భద్రత, విద్య, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ బాధ్యతలు, సామాజిక అంచనాలు వంటి అంశాలు రోజురోజుకు మానసిక భారాన్ని పెంచుతున్నాయి. ఫలితంగా ప్రశాంతమైన జీవితం కోసం వెతికే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. విద్యా రంగంలో పరిస్థితులు మరింత ఆందోళనకరంగా మారుతున్నాయి. మంచి మార్కులు సాధించాలి, పోటీ పరీక్షల్లో విజయం పొందాలి, ఉన్నత స్థాయి ఉద్యోగాలు సంపాదించాలి అనే లక్ష్యాలతో విద్యార్థులు చిన్న వయస్సులోనే తీవ్రమైన ఒత్తిడిని అనుభవిస్తున్నారు. ఆటలు, వినోదం, విశ్రాంతికి సమయం తగ్గిపోవడం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతింటోంది. విజయాన్ని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుని ప్రయాణించే క్రమంలో వ్యక్తిత్వ వికాసం, భావోద్వేగ స్థిరత్వం వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇది భవిష్యత్తులో మరిన్ని మానసిక సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.

ఉద్యోగ రంగంలో కూడా పరిస్థితి భిన్నంగా లేదు. అధిక పనిభారం, లక్ష్యాల సాధనపై ఒత్తిడి, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి, కార్యాలయ పోటీ వాతావరణం ఉద్యోగుల్లో మానసిక ఆందోళనలను పెంచుతున్నాయి. ఇంటి నుంచి పని చేసే వారు కూడా పని, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యతను కోల్పోతున్నారు. విశ్రాంతి సమయం తగ్గిపోవడం, నిరంతరం పనిలోనే మునిగిపోవడం వల్ల అలసట, చిరాకు, నిరుత్సాహం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఇది వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబ సంబంధాలపై కూడా ప్రభావం చూపుతోంది. సామాజిక మాధ్యమాల ప్రభావం కూడా ఒత్తిడి పెరగడానికి ఒక ప్రధాన కారణంగా మారింది. ఇతరుల విజయాలు, జీవనశైలిని నిరంతరం చూసే పరిస్థితి ఏర్పడడంతో పోలికలు పెరుగుతున్నాయి. తమ జీవితాన్ని ఇతరులతో పోల్చుకుని అసంతృప్తి చెందే వారి సంఖ్య అధికమవుతోంది. వాస్తవ జీవితానికి దూరంగా ఉండే చిత్రాలను నిజమని భావించడం వల్ల ఆత్మవిశ్వాసం తగ్గిపోతుంది. అంతేకాకుండా తప్పుడు సమాచారం, ప్రతికూల వ్యాఖ్యలు, ఆన్‌లైన్ వేధింపులు కూడా మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తున్నాయి.

మానసిక ప్రశాంతత కోసం ముందుగా జీవనశైలిలో మార్పులు అవసరం. పని, విశ్రాంతి, కుటుంబ జీవితం మధ్య సమతుల్యత ఉండాలి. ప్రతిరోజూ కొంత సమయం శారీరక వ్యాయామం, యోగా, ధ్యానం వంటి కార్యకలాపాలకు కేటాయించడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. ప్రకృతికి దగ్గరగా గడపడం, పుస్తకాలు చదవడం, సంగీతాన్ని ఆస్వాదించడం వంటి అలవాట్లు మనస్సుకు ప్రశాంతతను అందిస్తాయి. ఆరోగ్యకరమైన ఆహారం, సరిపడ నిద్ర కూడా మానసిక ఆరోగ్యానికి అత్యంత కీలకం. కుటుంబ వ్యవస్థ కూడా మానసిక ప్రశాంతతకు ప్రధాన ఆధారం. కుటుంబ సభ్యుల మధ్య పరస్పర సంభాషణ, ప్రేమ, మద్దతు ఉంటే ఒత్తిడిని సులభంగా అధిగమించవచ్చు. అయితే ఆధునిక జీవనశైలిలో కుటుంబ సభ్యులు ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ పరస్పరం మాట్లాడుకునే సమయం తగ్గిపోతోంది. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉంది. సమస్యలను పంచుకోవడం, భావోద్వేగాలకు విలువ ఇవ్వడం, ఒకరినొకరు అర్థం చేసుకోవడం ద్వారా కుటుంబం మానసిక బలానికి కేంద్రంగా మారుతుంది. సమాజం కూడా మానసిక ఆరోగ్యాన్ని ఒక ముఖ్యమైన అంశంగా గుర్తించాలి. ఇప్పటికీ మానసిక సమస్యలను చాలామంది అపోహలతో చూస్తున్నారు. అయితే ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు సాధారణ ఆరోగ్య సమస్యల మాదిరిగానే గుర్తించి తగిన సహాయం అందించాలి. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. అవసరమైనప్పుడు నిపుణుల సలహా తీసుకోవడాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు కూడా మానసిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల వరకు మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలి. ఆరోగ్య విధానాల్లో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం పెరగాలి. ప్రజల్లో అవగాహన కల్పించడం, కౌన్సెలింగ్ సేవలను విస్తరించడం, ఒత్తిడిని తగ్గించే సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమనే భావన సమాజంలో బలపడాలి.

ప్రశాంతత అనేది బయట వెతికే అంశం కాదని, మన జీవన విధానంలోనే నిర్మించుకోవాల్సిన విలువ అని గుర్తించాలి. ప్రతి సమస్యకు తక్షణ పరిష్కారం ఉండకపోవచ్చు. కానీ ప్రతి పరిస్థితిని సమతుల దృక్పథంతో స్వీకరించడం, మన సామర్థ్యాలను అర్థం చేసుకోవడం, అవసరానికి మించి ఆందోళన చెందకుండా ఉండడం ద్వారా ఒత్తిడిని నియంత్రించవచ్చు. విజయాల వెంట పరుగెత్తే క్రమంలో మనసును కోల్పోకుండా చూసుకోవడం కూడా అంతే ముఖ్యం. పెరుగుతున్న ఒత్తిడి నేటి సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి. దీనిని నిర్లక్ష్యం చేస్తే వ్యక్తిగతంగా, సామాజికంగా తీవ్రమైన పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంది. మానసిక ప్రశాంతతను ఒక విలాసంగా కాకుండా జీవిత అవసరంగా గుర్తించినప్పుడే పరిస్థితుల్లో మార్పు వస్తుంది. వ్యక్తి, కుటుంబం, విద్యాసంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వాలు కలిసి కృషి చేసినప్పుడే ఒత్తిడి తగ్గి ప్రశాంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాల్సిన సమయం ఆసన్నమైంది.

# ధన్యవాద భావనతో బలపడే మానవ బంధాలు

- ప్రపంచ కృతజ్ఞతా దినోత్సవం విలువల సందేశం
- కృతజ్ఞత వ్యక్తిత్వ వికాసానికి మూలాధారం



**డెస్క్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21న ప్రపంచ కృతజ్ఞతా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. మన జీవితంలో సహకరించిన వ్యక్తులు, కుటుంబ సభ్యులు, గురువులు, స్నేహితులు, సహచరులు, సమాజం పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేయాలని ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక దినాన్ని జరుపుకుంటారు. ఆధునిక జీవితంలో మనిషి అనేక విజయాలు సాధిస్తున్నప్పటికీ, ఆ విజయాల వెనుక ఉన్న వ్యక్తుల కృషిని గుర్తించడం చాలా అవసరం. కృతజ్ఞత అనేది కేవలం మర్యాదపూర్వక పదం కాదు, అది మనిషి వ్యక్తిత్వాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే గొప్ప విలువ. మనకు లభించిన ప్రతి అవకాశం, ప్రతి సహాయం, ప్రతి అనుభవం వెనుక ఉన్న విలువను గుర్తించే రోజు ప్రపంచ కృతజ్ఞతా దినోత్సవం.కృతజ్ఞత భావం మానవ సంబంధాలను బలపరిచే శక్తివంతమైన సాధనం. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులు లేదా సమాజంలోని ఇతర వ్యక్తులు అందించే సహకారాన్ని గుర్తించి ధన్యవాదాలు చెప్పడం ద్వారా పరస్పర గౌరవం పెరుగుతుంది. మన జీవితంలో చిన్న సహాయం చేసిన వారిని కూడా గుర్తుంచుకోవడం మానవత్వానికి నిదర్శనం. కృతజ్ఞత ఉన్న చోట ప్రేమ, అనురాగం, విశ్వాసం మరింత బలపడతాయి. అందుకే అన్ని సంస్కృతులు, సంప్రదాయాలు కృతజ్ఞతను ఒక గొప్ప గుణంగా భావించాయి. నేటి వేగవంతమైన జీవితంలో చాలామంది తమకు లభించిన మంచి విషయాలను గుర్తించకుండా ముందుకు సాగుతున్నారు. మరింత సంపాదించాలి, మరింత ఎదగాలి అనే ఆలోచనల మధ్య ఇప్పటికే ఉన్న ఆశీర్వాదాలను మరిచిపోతున్నారు. ఆరోగ్యం, కుటుంబం, స్నేహితులు, ఉపాధి, విద్య వంటి అంశాలు ప్రతి మనిషికి ఎంతో విలువైన వరాలు. వీటి పట్ల కృతజ్ఞత కలిగి ఉండటం ద్వారా జీవితంపై సంతృప్తి పెరుగుతుంది. మనకు లేని వాటి గురించి ఆలోచించడం కంటే ఉన్న వాటి విలువను గుర్తించడం ఆనందానికి మూలం అవుతుంది.కుటుంబ వ్యవస్థలో కృతజ్ఞతకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. తల్లిదండ్రులు పిల్లల కోసం చేసే త్యాగాలు, కుటుంబ సభ్యులు అందించే ప్రేమ, జీవిత భాగస్వామి చూపే సహకారం వంటి విషయాలను గుర్తించి ధన్యవాదాలు చెప్పడం ద్వారా బంధాలు మరింత బలపడతాయి. అనేక సందర్భాల్లో కుటుంబ సభ్యుల సేవలను సహజంగా తీసుకోవడం జరుగుతుంది. అయితే వారి కృషిని గుర్తించి కృతజ్ఞత వ్యక్తం చేసినప్పుడు కుటుంబంలో ఆప్యాయత, పరస్పర గౌరవం పెరుగుతాయి. ఒక చిన్న ధన్యవాదం కూడా బంధాలను మరింత మధురంగా మార్చగలదు. విద్యా రంగంలో గురువుల పాత్రను గుర్తించడానికి కూడా ఈ దినోత్సవం ఒక మంచి సందర్భం. విద్యార్థులకు జ్ఞానం అందించి వారి భవిష్యత్తుకు పునాది వేయడంలో గురువులు కీలక పాత్ర పోషిస్తారు. అలాగే రైతులు పండించే ఆహారం, వైద్యులు అందించే సేవలు, కార్మికుల శ్రమ, సైనికుల త్యాగం, శాస్త్రవేత్తల పరిశోధనలు సమాజ పురోగతికి ఆధారం. ప్రతి వృత్తి వెనుక ఉన్న కృషిని గుర్తించడం ద్వారా సమాజంలో పరస్పర గౌరవం పెరుగుతుంది. కృతజ్ఞత అనేది ఇతరుల సేవలను గౌరవించే గొప్ప సంస్కృతికి ప్రతీక.

మానసిక ఆరోగ్య పరంగా కూడా కృతజ్ఞతకు విశేష ప్రాధాన్యం ఉంది. జీవితంలో మంచి విషయాలను గుర్తించే వ్యక్తులు సాధారణంగా సానుకూల ఆలోచనలతో ఉంటారని అనేక అధ్యయనాలు వెల్లడించాయి. కృతజ్ఞత భావన ఒత్తిడి, ఆందోళనలను తగ్గించి మానసిక ప్రశాంతతను పెంచుతుంది. ప్రతి రోజు మనకు జరిగిన మంచి విషయాలను గుర్తుచేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం, ఆనందం పెరుగుతాయి. అందువల్ల కృతజ్ఞత ఒక భావోద్వేగం మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా కూడా మారింది. సామాజిక మాధ్యమాల విస్తరణతో కృతజ్ఞతను వ్యక్తం చేసే విధానాలు కూడా మారాయి. అనేక మంది తమ జీవితంలో ప్రేరణగా నిలిచిన వ్యక్తులను గుర్తుచేసుకుంటూ సందేశాలు పంచుకుంటున్నారు. అయితే కృతజ్ఞత కేవలం మాటల్లో మాత్రమే కాకుండా చేతల్లో కూడా కనిపించాలి. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, ఇతరుల అభివృద్ధికి తోడ్పడటం ద్వారా కృతజ్ఞతను ఆచరణలో చూపించవచ్చు. నిజమైన కృతజ్ఞత సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడుతుంది.ప్రకృతి పట్ల కృతజ్ఞత కూడా నేటి కాలంలో అత్యంత అవసరం. గాలి, నీరు, నేల, అడవులు, జీవవైవిధ్యం వంటి సహజ వనరులన్నీ మన జీవనానికి ఆధారం. అయినప్పటికీ మానవ కార్యకలాపాల కారణంగా ప్రకృతి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. చెట్లు నాటడం, నీటిని ఆదా చేయడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి చర్యలు ప్రకృతి పట్ల కృతజ్ఞతను చూపే మార్గాలు. ప్రకృతి మనకు అందించిన వరాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారింది.

కృతజ్ఞత భావం సమాజంలో ఐక్యతను పెంచుతుంది. ఇతరుల కృషిని గుర్తించి గౌరవించే సంస్కృతి ఉన్నప్పుడు సహకారం, పరస్పర విశ్వాసం బలపడతాయి. సమాజ అభివృద్ధి అనేది ఒక్క వ్యక్తి కృషి వల్ల కాదు, అనేక మంది సమిష్టి కృషి వల్ల సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరి పాత్రను గౌరవించడం ద్వారా సమాజంలో మానవతా విలువలు మరింత బలపడతాయి. కృతజ్ఞతతో కూడిన సమాజం మరింత సంతోషకరమైన, సామరస్యపూర్వకమైన సమాజంగా రూపుదిద్దుకుంటుంది. ప్రపంచ కృతజ్ఞతా దినోత్సవం మనిషికి ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. జీవితంలో లభించిన ప్రతి అవకాశాన్ని, ప్రతి సహాయాన్ని, ప్రతి అనుబంధాన్ని విలువైనదిగా భావించాలని ఈ రోజు గుర్తు చేస్తుంది. కృతజ్ఞత అనేది కేవలం ఒక మర్యాద కాదు, అది మనిషిని మరింత వినయపూర్వకంగా, బాధ్యతాయుతంగా, సంతోషంగా తీర్చిదిద్దే విలువ. కుటుంబం నుంచి ప్రపంచం వరకు ప్రతి ఒక్కరి పాత్రను గుర్తించి ధన్యవాదాలు చెప్పే సంస్కృతి పెరిగినప్పుడే మానవ సంబంధాలు మరింత బలపడతాయి. కృతజ్ఞత భావం వ్యక్తిగత జీవితానికే కాదు, సమాజ శ్రేయస్సుకు కూడా పునాదిగా నిలుస్తుందని ఈ దినోత్సవం స్పష్టంగా చాటిచెబుతోంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 'కల్పిత నాయకుడు' బయటికి రాకుండా...

## కీలకంగా మారిన జర్నలిస్ట్ కల్పన పోరాటం!







- పుస్తకాన్ని నిషేధించాలంటూ హైదరాబాద్ నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష
- సచివాలయ ముట్టడికి యత్నం..
- అరెస్టు వరకు ఎక్కడా వెనక్కి తగ్గని మహిళా జర్నలిస్టు



**హైదరాబాద్,సెప్టెంబర్20 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రశ్నించడం.. ప్రజల తరపున గొంతెత్తడం.. అన్యాయం అనిపించిన అంశాలను ప్రజల ముందుకు తీసుకురావడం.. తనదైన శైలిలో ముందుకు సాగుతున్న మహిళా జర్నలిస్టు కల్పన. సొంతంగా యూట్యూబ్ వార్తా ఛానల్ నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తున్న ఆమె.. 'కల్పిత నాయకుడు' పుస్తక వివాదంలోనూ తన నిరసనను బలంగా వినిపించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై హమారా ప్రసాద్ రచించిన 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని విడుదల చేయకూడదని, పుస్తకంపై చర్యలు తీసుకోవాలని, హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కల్పన ఉద్యమబాట పట్టారు.

### అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష

పుస్తకాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద కల్పన ధర్నా నిర్వహించి దీక్ష చేపట్టారు.
అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు, రచనలు వస్తే ప్రశ్నించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు తన పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.

### సచివాలయ ముట్టడికి యత్నం.. అరెస్టు

అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్షతో ఆగకుండా పుస్తక విడుదలను అడ్డుకోవాలని కోరుతూ ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు సచివాలయ ముట్టడికి కల్పన ప్రయత్నించారు.ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నప్పటికీ, పుస్తకంపై తన అభ్యంతరాన్ని, హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌ను ఆమె కొనసాగించారు. పుస్తకం విడుదలను అడ్డుకోవడం, హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో కల్పన చేపట్టిన వరుస నిరసనలు ఈ వివాదంలో ఆమెను ఒక ముఖ్యమైన ఉద్యమ స్వరంగా నిలిపాయి.

### ప్రశ్నించే గొంతుకగా కల్పన

**సొంత యూట్యూబ్ వార్తా ఛానల్ ద్వారా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికారులను ప్రశ్నించడం, సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలపై తన వాణిని వినిపించడం కల్పన జర్నలిజంలో ప్రత్యేకతగా నిలిచింది.'కల్పిత నాయకుడు' వివాదంలోనూ అదే విధానాన్ని కొనసాగిస్తూ, మాటలకే పరిమితం కాకుండా అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్షకు కూర్చున్నారు. అనంతరం సచివాలయ ముట్టడికి ప్రయత్నించి అరెస్టు వరకు వెళ్లారు.**

### కలం నుంచి ఉద్యమ స్వరం వరకు

**కల్పన ప్రయాణంలో ప్రత్యేకత.. సొంత వార్తా ఛానల్ ద్వారా ప్రశ్నించే గొంతుకగా నిలవడమే కాకుండా, తాను ప్రశ్నిస్తున్న అంశంపై ప్రత్యక్షంగా ఉద్యమంలోకి అడుగుపెట్టడం.అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష.. సచివాలయ ముట్టడికి యత్నం.. అరెస్టు వరకు కొనసాగిన ఆమె పోరాటం 'కల్పిత నాయకుడు' వివాదంలో ప్రత్యేక చర్చకు దారితీసింది.ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తున్న కల్పనకు టీఎంజేఎఫ్ అందించిన సత్కారం.. ఆమె చేపట్టిన పోరాటానికి లభించిన గుర్తింపుగా నిలిచింది.**

### టీఎంజేఎఫ్ ఘన సత్కారం

కల్పన చేపట్టిన పోరాటాన్ని గుర్తించిన తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరమ్ ఆమెను ఘనంగా సత్కరించింది. ఫోరమ్ ఆధ్వర్యంలో కల్పనకు శాలువా కప్పి సన్మానం చేసి, భారత రాజ్యాంగ ప్రతిని అందజేశారు. అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలపై ఆమె వ్యక్తం చేసిన నిరసనను గుర్తిస్తూ ఈ సత్కారం నిర్వహించారు.




# తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొల్లెపాక రాజేష్

**హైదరాబాద్, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు) :**
తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక సంపాదకులు బొల్లెపాక రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఫోరమ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుల నాగేందర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీసీసీఈ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బొల్లెపాక రాజేష్ మాట్లాడుతూ తెలంగాణలోని మాదిగ జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఫోరమ్‌ను బలోపేతం చేస్తానని తెలిపారు. యువ జర్నలిస్టులకు మార్గదర్శకత్వం, వృత్తిపరమైన శిక్షణ అందించడంతో పాటు, మహిళా జర్నలిస్టుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఫోరమ్‌ను వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా మాదిగ జర్నలిస్టుల సమష్టి ప్రయోజనాల కోసం పనిచేసే బలమైన వేదికగా తీర్చిదిద్దేందుకు నూతన కార్యవర్గంతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల మధ్య ఐక్యతను పెంపొందించి, కష్టకాలంలో సభ్యులకు అండగా నిలిచే విధంగా ఫోరమ్‌ను ముందుకు తీసుకెళ్తామని రాజేష్ తెలిపారు.



# మోదీ మిమిక్రీపై బీజేపీ ఆగ్రహం


- **రాహుల్ కార్యక్రమంలో మిమిక్రీపై రాజకీయ దుమారం**
- **కాంగ్రెస్‌పై బీజేపీ నేతల తీవ్ర విమర్శలు**
- **మిమిక్రీ మాత్రమేనన్న కాంగ్రెస్ నేతలు**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీని అనుకరిస్తూ జరిగిన మిమిక్రీపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సమక్షంలో హాస్యకారుడు పుల్కిత్ మణి మోదీ హావభావాలు, మాట్లాడే తీరును అనుకరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి తదితరులు రాహుల్‌గాంధీ తీరును విమర్శించారు. మోదీ దివంగత తల్లికి సంబంధించిన వ్యాఖ్యలను కూడా ఈ కార్యక్రమంలో ప్రస్తావించడాన్ని వారు తప్పుబట్టారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, బీజేపీ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ కూడా విమర్శలు చేశారు. కాంగ్రెస్ రాజకీయ విమర్శలకు బదులుగా హాస్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తోందని వారు వ్యాఖ్యానించారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు మాత్రం ఇది మిమిక్రీ మాత్రమేనని, రాజకీయ వ్యంగ్యానికి ప్రజాస్వామ్యంలో స్థానం ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనతో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ విమర్శలు మరింత తీవ్రంగా మారాయి. కార్యక్రమంలో విద్యార్థుల సమస్యలు, విద్య, ఉద్యోగాలు తదితర అంశాలపై రాహుల్‌గాంధీ మాట్లాడినప్పటికీ, మోదీ మిమిక్రీ వివాదమే ప్రస్తుతం ప్రధాన చర్చగా మారింది.

# అకాలీ దళ్ నేతపై అత్యాచారం కేసు

- **చావ్లాపై మహిళ ఫిర్యాదు**
- **ఆరోపణలను ఖండించిన చావ్లా**



**చండీగఢ్ సెప్టెంబర్ 20 (తెలంగాణ ముచ్చట్లు):** శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్జీపీసీ) సభ్యుడు, శిరోమణి అకాలీ దళ్ సీనియర్ నేత అమర్‌జిత్ సింగ్ చావ్లాపై ఓ మహిళ అత్యాచారం ఆరోపణలు చేసింది. ఆనంద్‌పూర్ సాహిబ్‌లోని యాత్రికుల వసతి గృహంలో తనను బంధించి అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంగ్రూర్ జిల్లాకు చెందిన ఆ మహిళ ప్రస్తుతం బహ్రెయిన్‌లో నివసిస్తోంది. అకాలీ దళ్ నాయకురాలు రూప్ కౌర్ సంధు ఫేస్‌బుక్ పేజీ ద్వారా విడుదల చేసిన వీడియోలో ఆమె ఈ ఆరోపణలు చేసింది. ఆగస్టు 21న ఆనంద్‌పూర్ సాహిబ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఫిర్యాదుకు ముందు పలు సిక్కు సంస్థలను సంప్రదించినట్లు పేర్కొంది. అకాల్ తఖ్త్ అదనపు హెడ్ గ్రంథి మల్కిత్ సింగ్, తఖ్త్ కేశ్‌గఢ్ సాహిబ్ డ్రైవర్ మోహన్ సింగ్ తనకు అసభ్యకరమైన సందేశాలు పంపారని కూడా ఆమె ఆరోపించింది. అయితే ఈ ఇద్దరిపై కేసు నమోదు కాలేదు. చావ్లాపై మహిళ ఫిర్యాదు మేరకు అత్యాచారంతో పాటు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. మరోవైపు ఎస్జీపీసీ ప్రధాన కార్యదర్శి కుల్వంత్ సింగ్ మన్నన్ స్పందిస్తూ.. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఎస్జీపీసీ అధ్యక్షుడు హర్జిందర్ సింగ్ ధామి ఆదేశించినట్లు వెల్లడించారు.తనపై వచ్చిన ఆరోపణలను చావ్లా ఖండించారు. అవన్నీ అవాస్తవాలు, కల్పిత ఆరోపణలని పేర్కొన్నారు. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ ఉద్దేశాలతోనే తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in